ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



## క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిహారం అందజేయాలి




వివరాలు మెయిన్‌లో...

# పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చర్యలు



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :**జిల్లాలోని అనాథ ,పాక్షిక అనాథ పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఉన్న అనాథ, పాక్షిక అనాథ పిల్లలను పూర్తి స్థాయిలో గుర్తించాలని అన్నారు. పిల్లల తల్లి తండ్రుల పేరు మీద ఏవైనా ఆస్తులు ఉంటే అన్యాక్రాంతం కాకుండా పిల్లలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో అనాథలు, పాక్షిక అనాథలను గుర్తించి వారికి విద్య అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా సంక్షేమ శాఖ నుంచి వచ్చే అనాథ, పాక్షిక అనాథ బాలికల జాబితా ను ఆమోదించి కేజీబీవీ లల,గురుకులాలో సీట్లు కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు.చదువు ముగిసిన అనాథ పిల్లలు ఏం చేస్తున్నారు అనే అంశం ట్రాక్ చేయాలని అన్నారు. అనాథ పిల్లలు ఎవరికైనా ఏ.టీ.సీ. కోర్సులలో ఆసక్తి ఉంటే నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. చైల్డ్ కేర్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు వచ్చే ప్రతి ఫిర్యాదు అటెండ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. పోక్సో కేసులకు సంబంధించి పరిహారం ఫైల్ మన వద్ద పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. బాల సదనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. బాల సదనంలో పిల్లలు ఎవరు కింద నిద్రపోకుండా బెడ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. సుల్తానాబాద్ లో మంజూరు చేసిన బాల సదనం పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ పనులు ఆలస్యం కాకుండా నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్, దేవాలయాలు, బస్టాండ్, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలలో రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలను అనుమతి లేకుండా నడపడానికి ఆస్కారం లేదని అన్నారు. రిజిస్ట్రేషన్ చేయకుండా నడిపే ఆశ్రమాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాల పై అవగాహన కల్పించాలని, అనాథ పిల్లలు, పాక్షిక అనాథ పిల్లల, బాల్య వివాహాలు సమాచారం ప్రజల నుంచి మనకు నేరుగా వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో జరిగే ప్రతి అబార్షన్ కేసు ట్రాక్ చేయాలని అన్నారు. ఆడపిల్ల పుడుతుంది అనే కారణంతో జరిగే అబార్షన్ లను నిలువరించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు టార్పాలిన్లు కచ్చితంగా అందజేయాలి

సన్నరకం ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలి* వర్షం తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలి* వరి కోతలు వాయిదా వేసుకోవాలి* ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్* జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/తంగళ్ళపల్లి :** అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కచ్చితంగా టార్పాలిన్లు అందజేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, వడ్ల తేమ శాతం పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో రైతులు వరి కోతలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలని. సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అన్ లోడ్ చేసుకునేలా చూడాలని, సన్నరకం వడ్లను కూడా తీసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పత్తికి మద్దతు ధర

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



వివరాలు మెయిన్‌లో...

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**స్పెషల్ ఇన్సెంటివ్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘంమార్గదర్శకాలకనుగుణంగా చేపడుతూ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. అర్బన్ నియోజకవర్గపరిధిలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ గురువారం నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ కార్యాలయంలో ఎఈఆర్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తప్పిదాలకు తావు లేకుండా పారదర్శకంగా చేపడుతూ రెండు రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బాధ్యతాయుతంగా పని చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో తప్పకుండా ఉండేలా నిశిత పరిశీలన జరపాలన్నారు. 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరిలుగా విభజించటంజరిగిందని గుర్తు చేశారు. ఇందులో కేటగిరి ఎ లో 1987 కంటే ముందు జన్మించి 2002 తో పాటు 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలోనమోదు కాబడిన వారు కేటగిరి సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి డి లో 20022007 మధ్యలో జన్మించిన వారిగావిభజించటంజరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఎ జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, అది ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో నమోదు చేయబడుతుందన్నారు. ఆ తర్వాత కేటగిరి సి కేటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఎ కు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఏఈఆర్ఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా శనివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. సమీక్షలో తహసీల్దార్ బాలరాజు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, జితేందర్, ఎఈఆర్ఓలు,బిఎల్ఓ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# రైతుల పాలిట శాపంలా మారిన అకాలవర్షం..



ప్రజాపక్షం/ముధోల్ :ఎల్లకాలం కష్టపడివ పంట పండిస్తున్న రైతులకు ఈ ఏడాది కురుస్తున్న వర్షం వారి పాలిట శాపంలా మారింది.గడిచిన వారం రోజులుగా బుధవారం రాత్రి,గురువారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.గత ఖరీఫ్ సీజన్ లో ఏకధాటిగా కురిసి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతో అసలే పంట దిగుబడి తగ్గిందని నిరాశతో ఉన్న రైతుకు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం రైతుకు కంటతడి పెట్టిస్తోంది.ఖరీఫ్ లో జరిగిన నష్టం రబీ సీజన్ పంటల్లో పూడ్చి లాభంగా మార్చుకుందామనుకున్న రైతులపై వాతావరణం కన్నెర్ర చేసి కంటికి కునుకులేకుండా చేస్తోంది.ఇప్పటికే 25 నుండి 30 శాతం మంది రైతులు పంట పొలాలను దున్నుకుని విత్తనాలు విత్తడం జరిగింది.విత్తనాలు మొలుకెత్తే సమయానికి ఇలాంటి వర్షం కురవడం నష్టం చేకూర్చడమే,మొలకెత్తే విత్తనాలు వర్షపు ధాటికి మొలకెత్తకుండా మురిగిపోయి భూమిలోనే కలిసిపోవడమో నీటిలో కొట్టుకుపోవడమో జరుగుతాయి.ఈ ఏడాది వర్షం నీడలా వెంటాడుతూ రైతులను ఆగం చేస్తొంది.విత్తనాలుర విత్తిన రైతులకు మరోసారి రైతలు విత్తడమంటే ఆర్థికంగా నష్టం చేకూర్చే విషయమేనని చెప్పాలి.ఒకసారి విత్తనాలు కొనడానికే అప్పులు పాలవుతున్న రైతుకు మరోసారి విత్తనం కొని విత్తాలంటే ఎన్నడు తీరని దెబ్బే.మరి కొంత మంది రైతుల విత్తనాలు విత్తకున్న భూమిని చదును చేసుకుని విత్తనాలు విత్తడానికి సిద్ధంగా ఉంచారు.ఇలా రోజు వారిగా కురుస్తున్న అకాల వర్షానికి వారుర సైతం మరల భూమిని చదును చేయాల్సిందే!ఏది ఏమైనా రైతులకు వాతావరణ పరిస్థితులు శత్రువుగా వెంట పడుతున్నాయి.ఇలాంటతి ప్రతికూల పరిస్థితుల్లో రైతు మనుగడ సాధ్యమేనానని ప్రశ్న తెలెత్తుతోంది.ఖరీఫ్ సీజన్లో ఆశించిన దిగుబడి రాక వచ్చిన పంటను దళారులకు అమ్మి మోసపోయిన రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అనేలా పరిస్థితులు మారాయి.అంతే కాకుండావరి,పత్తి పండించిన రైతుకు సైతం వర్షం తీరని ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండ నిలిచేదెవరు రైతు గోడును పట్టించుకునేదవరు..! ఆదుకోవాల్సిన ప్రభుత్వం నష్టపోయిన రైతుల పట్ల జాలి చూపుతుందో మరి రైతే రాజు అంటూ కాలం వెల్లదిస్తుందో చూడాలి.

**ప్రభుత్వం రైతన్నకు అండగా నిలిచి ఆదుకోవాలి(విజయ్ కుమార్ రైతు (ముధోల్))**

ఖరీఫ్ సీజన్లో వర్షపు ధాటికి తమ ప్రాంత అత్యధిక రైతులు నష్టపోయారనీ రైతు విజయ్ కుమార్ అన్నారు.తనకున్న రెండెకరాల్లో వరి,రెండెకరాల్లో సోయా పంట పండించడం జరిగింది.ఏకధాటిగా కురిసిన వర్షాలకు సోయా ఎకరానికి 4 క్వింటళ్ల దిగుబడి రాలేదు.పంట చేతికొచ్చిన సమయంలో సైతం వర్షం ఉండడంతో యంత్రాలతో పంట కోయడానికి అనుకూల పరిస్థితులు లేదు.గత్యంతరం లేక కూలీలతో పంట కోయడం జరిగింది.పంట కోయడానికి కూలీలు ఎకరానికి 3600 చొప్పున తీసుకున్నారు.కోసిన పంటను నూర్పిడి చేయడానికి 50 కిలోల బస్తాకు 200 చొప్పున తీసుకున్నారు.ఇలా దిగుబడి లేని పంటకు పెద్ద మొత్తంలో కూలీలు చెల్లిస్తే వచ్చిన పంటకు కనీస మద్దతు ధర సైతం లేకపోలేదు.ఏమిఇ చేయని దిక్కు తోచని పరిస్థితులో దళారులకు పంటను అమ్మి కూలీలను చెల్లించడం జరిగిందన్నారు.అంతే కాకుండా ఇప్పుడు చేతికొచ్చిన వరి పంట సైతం నీటి పాలయ్యేటట్లుందని తనతో పాటు ఎంతో మంది రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో రైతు జీవనం సాగడం కష్టమంటున్నాడు.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పంట వచ్చిన సమయంలోనే ఏర్పాటు చేసినట్లయితే ఎంతో కొంత లాభపడేవాళ్ళం కానీ చిన్న మధ్య తరగతి రైతులు పంటలు అమ్ముకున్నాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం మాలాంటి రైతులకు లాభం లేకుండా అయిపోయిందని తెలిపారు.ప్రభుత్వం రైతన్నకు పెద్దన్నలా అండగా నిలిచి నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకుని రాబోయే కాలానికి నాణ్యమైన విత్తనాలు సైతం సబ్సిడీపై అందించాలని కోరారు.అంతే కాకుండా రైతు పండించిన అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుకు భరోసాగా నిలవాలని విన్నవించారు.

## మూగజీవాల ప్రాణాలను హరిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :మండలంలోని బన్సపల్లి గ్రామంలో గ్రామం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ మూగ జీవాల ప్రాణాలను అరిస్తుంది.గ్రామం నుండి మూగ జీవాలు మేతకు వెళ్లి దారిలో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ఉండడంతో కింద ఉన్న ఎర్తింగ్ పైపు తగిలి 20 రోజుల క్రితం ఆవు మరణించడం జరిగింది.అలాగే గురువారం రోజున అటువైపు వెళుతున్న గుజ్జుల్ల సా యన్న అనే రైతు యొక్క 15 వెయ్యిల వి లువగల గొర్రె ఎర్తింగ్ పైపుకు విద్యుత్ స రఫరా కావడంతో తగిలి మరణించడం జ రిగి ంది .సంఘటన స్థలానికి దిలావర్పూర్ ప శు వైద్యాధికారి విజయ్ కుమార్ చేరుకొని పంచనమ నిర్వహించడం జరిగింది .ట్రా న్స్ఫర్మర్‌కు విద్యుత్ అధికారులుకంచఏర్పా టు చేయాలనిమరణించినగొర్రెకునష్టపరి హారం అందించాలని బాధితుడు వాపో యా డు.

## నూతన ఎంపిడిఒ, ఎంపిఒకు సన్మానం



ప్రజాపక్షం/తానూర్ :ఇటీవలే నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎంపిడి ఒ శ్రీధర్,ఎంపిఒఅమీర్ ఖాన్‌కు గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని కోలూర్,గ్రామానికి చెందిన యువ నాయకులు, డి.నాగేష్, విట్టల్,జైభీమ్,అనిల్,సాకిత్,గంగాధర్,నాగరాజ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువలు కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో,శ్రీధర్ మాట్లాడుతూ..ప్రజల సమస్యలు పరిష్కరించేందుకుప్రాధాన్యతఇస్తానని,పేర్కొన్నారు.

## విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేక విద్యారంగం నిర్వీర్యం




ప్రజాపక్షం/బైంసా :బైంసా మండలంలోని విద్యా భారతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.యుఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడంతో విద్యారంగం నిర్వీర్యమవుతోందన్నారు.బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్స్,స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి.ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు.పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్ మొత్తాన్ని ప్రభత్వం వెంటనే విడుదలచేయాలని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగానికి ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని ఆరోపించారు.దాదాపు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పది సంవత్సరాలు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేసిందని ఆరోపించారు.విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి విద్యార్థులను బలిదానాన్ని కోరుకుందని ఆరోపించారు.తెలంగాణ ఇచ్చిన పార్టీగా చెప్పుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి విద్యార్థుల సమస్యలను విస్మరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.దసరా,దీపావళి పండుగ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్ రూ.600 కోట్లు విడుదల చేస్తామని మాయమాటలు చెప్పిందని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్,స్కాలర్‌షిప్ మొత్తంను వెంటనే విడుదల చేయాలని అన్నారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నవనీత,మయూరి,వెన్నెల,రోనిక,వెంకటేష్,పవన్,దుర్గాప్రసాద్,జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## సోయా,ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### రైతులు అప్రమత్తంగా ఉండాలి, బిజెఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి





ప్రజాపక్షం/దిలావర్పూర్:దిలావర్‌పూర్ మండల కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని,వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.సోయాకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)క్వింటాల్‌కు రూ.5328,వడ్లకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2389 లుగా ఉందని ఆయన పేర్కొన్నారు.రైతులు బయట మార్కెట్‌లో దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు.ఆకాల భారీ వర్షాల కారణంగా కళ్లాల్లో ధాన్యం తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో,ప్రభుత్వ మద్దతు ధరతో తడిసిన ధాన్యాన్ని,ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ...**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు.దిలావర్‌పూర్ మండంలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు,నర్సాపూర్ 	మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు ఆయన ఈ చెక్కులను అందించారు.ఈ రెండు కార్యక్రమాలలోనూ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి,నాయకులు ముత్యం రెడ్డి,పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ తాకిడికి తీవ్ర పంట నష్టం



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :మండలంలో కోనాపూర్, కోనసముందర్, బషీరాబాద్, ఉప్లూర్‌లో బుధవారం, గురువారం కురిసిన భారీ వర్షానికి వరి పంట నీట మునగటమే కాకుండా ఎండబెట్టిన వరి ధాన్యం తడిసి పంట నష్టం సంభవించింది. కోనసముందర్, కోనాపూర్‌లో ఆరబోసిన వరి ధాన్యం తడవగా బషీరాబాద్, ఉప్లూర్ గ్రామాల్లో పంట నీట మునిగి నష్టం చేకూర్చింది. కమ్మర్‌పల్లిలో 70 ఎకరాలు, చౌట్‌పల్లిలో 60 ఎకరాలు బషీరాబాద్‌లో 50 ఎకరాలులు, చౌట్‌పల్లిలో 60 ఎకరాలు, ఉప్లూర్ క్లస్టర్‌లో 65 ఎకరాలు, బషీరాబాద్‌లో 50 ఎకరాలు, కకోనసముందర్ క్లస్టటర్‌లో 120 ఎకరాల పంటట వర్షానికి దెబ్బ తిన్నట్లు మండడలల వ్యవవసాయాధికారిని రమ్యశ్రీ తెలిపారు. రైతన్నలు కష్టపడి పండించిన పంట రాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్ద అవ్వటం, చేతికొచ్చిన పంట వర్షంలో మునిగిపోవటం రైతన్నలకు కన్నీటిని మిగిల్చింది.ప్రభుత్వం ఏవిధంగానైనా సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలకేంద్రానికి చెందిన భారత రాష్ట్ర సమితి పార్టీ యువ నాయకుడు సాయికిరణ్ కుటుంబాన్ని జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జీ హన్మంత్‌షిండే గురువారం పరామర్శించారు. సాయికిరణ్ తండ్రి నారాయణకు ఇటీవల సర్జరీ కావడంతో విషయం తెలుసుకున్న హన్మంత్‌షిండే వారి స్వగృహానికి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి ఆరా తీయడమే కాకుండా వైధ్యుల సలహాలు, సూచనలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను తహసీల్దార్ నరేంధర్‌గౌడ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మీ పథకం వెలుగులు నింపుతుందని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంబిగె హన్మండ్లు, నాయకులు హనుమ అశోక్, లబ్దిదారులు, గ్రామపెద్దలుపాల్గొన్నారు.

# ప్రైవేట్ బస్సులు, స్కూల్ బస్సుల తనిఖీ




**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మోటార్ వెహికిల్ అధికారులు గురువారం ప్రైవేట్ బస్సులు, స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో గురువారం బోధన్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సిఐ వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో ప్రైవేట్ బస్సులను, ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. వాహనాల ఫిట్నెస్, సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామాలయంలో లక్ష దీపారాధన

**ప్రజాపక్షం /నందిపేట్ :**నందిపేట్ మండల కేంద్రంలో శనివారం కార్తీక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా రామాలయంలో లక్ష దీపారాధన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రామ్‌నగర్‌లో నిర్మించిన నూతన రామాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆశీస్సులతోప్రారంభిస్తామనినిర్వాహకులు తెలిపారు.

# బాధితులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/నందిపేట్ :**డొంకేశ్వర్ మండలంలో గంగ సముందర్ గ్రామంలో బద్దం శ్రీనివాస్ భార్య సాయవ్వ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పరామర్శించారు. అలాగే డొంకేశ్వర్ గ్రామంలో గొల్ల చిన్నయ్య తల్లి, మధు తల్లి, నాయకుడు చందు తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఎమ్మెల్యే ధైర్యంచెప్పారు. ఎమ్మెల్యే వెంట బీజేపి నాయకులు ఉన్నారు.

# ప్రమాదకరంగా మారిన జాతీయరహదారి 63



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:**కమ్మర్‌పల్లి నుండి మెట్‌పల్లి జాతీయ 63 రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రయాణీకులకు అత్యంత ఇబ్బందికరంగా మారింది. ప్రతినిత్యం ఏదొక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు మొత్తం గుంతలతో వర్షాలు బాగా పడటంతో చెట్లు, పిచ్చిమొక్కలు రోడ్డుపైకి వచ్చి ఎదురుగా వచ్చే వాహనాలను కూడా కనిపెట్టలేక ప్రమాదాలన్నింటి జరుగుతున్న ఆర్అండ్‌బి వారు పట్టించుకున్నదాఖలాలు లేవు. పెర్కిట్ నుంచి మెట్‌పల్లి వరకు రహదారి అయితే మరి ఘోరంగా తయారై గుంతలతో, చెట్ల పొదలతో కూడి టూ వీలర్స్,ఆటో వారికి ప్రయాణమనేది చాలా ప్రమాదకరంగా మారింది.పెర్కిట్ నుండి కరీంనగర్ వరకు ఫోర్ వే లైన్ రహదారి మంజూరైన ఇప్పటివరకు మెట్‌పల్లి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఫోర్ వే లైన్ అయ్యే వరకు ఎక్కడైతే గుంతలమయమై ఉన్న రహదారికి మరమ్మతులు చేసి చెట్ల పొదలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను ప్రయాణికులు కోరుకుంటున్నారు.

# శివాలయం ప్రహారి గోడ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలోని పురాతన శివాలయం చు ట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక గ్రామ పెద్దలు అబ్బగోని లక్ష్మీ నర్స య్య గౌడ్ తమ వంతు సహకారం అం దిస్తూ ప్రహరీ గోడ నిర్మాణానికి విరాళంగా రూ. 51,111 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సయ్య గౌడ్ మా ట్లాడుతూ.. ఈ మహా శివుని ఆలయ అభివృద్ధిలో పాలు పంచుకునే గొప్ప అవకాశం దక్కినందుకు తాను ఎంతో సంతోషంగా ఉన్నానని అభిప్రాయపడ్డారు. ఆలయాభివృద్ధికి తోడ్పాటు అందించడానికి గ్రామస్తులు కూడా ఉదారంగా సహాయ సహకారాలు అందించాలని ఆయన కో రారు. ఈ శంకు కార్యక్రమంలో ముఖ్యంగా బిజెపి సీనియ ర్ నాయకులు మేక సంతోష్, సాటాపూర్ తాజా మాజీ స ర్పంచ్ ఏకార్ పాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయిలు, డాక్టర్లు దశరథ్, అర్జున్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులు,భారీ వర్షాలతో వరిపంట నేల మట్టం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :**ఖానాపూర్ మండలంలో పలు గ్రామాల్లో అకాల వర్షంతో చేతి కొచ్చిన పంట నేలకొరిగింది అని రైతులు బాధపడుతున్నారు.మండలంలోని దిల్వార్పూర్,తర్లపాడు,సత్తెనపల్లి,ఎల్లాపూర్,బీర్నంది,రంగాపేట్,రాజురా,మేడం పెల్లి తదితర గ్రామాల్లో తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలతో పాటు వేగంగా వీస్తున్న గాలుల దాటికి చేతికొచ్చిన పంట అడ్డం పడి నేలకొరిగింది.పంట కోతకొచ్చే సమయంలో వర్షాలతో నెలకొరికిన పంట మళ్లీ మొలకలు వచ్చే అవకాశం ఉందని,ఎన్నో కష్టాలకోర్చి పంట పండిస్తే వర్షాలతో పంట పాడవుతుందని,ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు



న్నారు.పంట నష్టం పై అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.పంట చేతి కొచ్చే సమయంలో ఈ వానలు ఏంటంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

# వర్షానికి నేలకు ఒరిగిన పొలం



**ప్రజాపక్షం/మోర్తాడ్:**మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల రైతులు పండిస్తున్న కోతకు వచ్చిన వరి పొలాలు వర్షం పడటంతో పంట పొలాల్లో వరి పొలమంతా నేలకొరిగింది. దీంతో రైతన్నలకు అపార నష్టం వాటిల్లిందని స్థానిక రైతుల ఆవేదన చెందుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లోనైతే వాగులు వంకలు పొంగిపొర్లి పొలాలు సైతం నీటమునిగాయి. ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం తుఫాన్ వచ్చి రైతులు పండిస్తున్న పంటలన్నిటిని నీట ముంచిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏది ఏమైన ప్రస్తుతం నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం కట్టిస్తూ రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని మండల రైతులు కోరారు.

# శుక్రవారం 2కె రన్ నిర్వహణ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**రాష్ట్రీయ ఏకతా దివస్ సర్దార్ వల్లాభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా నేడు శుక్రవారం 2కె రన్ నిర్వహిస్తున్నట్లు నిజాంసాగర్ సబ్ ఇన్స్పెక్టర్ శివకుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందులో భాగంగా 31వ తేదీ శుక్రవారం ఉదయం 7.30 గం.లకు నవోదయ విద్యాలయం నుండి నిజాంసాగర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు 2కె రన్ నిర్వహించబడుతుందని, యువకులు, ప్రజలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఐ కోరారు.

# దైవచింతనతో ఆశ్రమాన్ని ఉపయోగించుకోవాలి



**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలం కుప్టీ గ్రామంలో భక్తుల కోరిక మేరకు శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి గురువారం బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆడే గజేందర్ భూమి పూజ చేశారు.ఆయనను గ్రామస్తులు డప్పుచప్పులతో గ్రామంలోకి ఆహ్వానించారు.అనంతరం భక్తులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దైవచింతనతో ఆశ్రమాన్ని ఉపయోగించుకోవాలని అదేవిధంగా నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని రేవంతన్న ప్రభుత్వం ఎల్లవేళలా మనందరికీ అండగా ఉంటుందని మనందరం ప్రభుత్వానికి అదే విధంగా ఉండాలని ఆకాంక్షించారు.గ్రామస్తులు అడిగిన వెంటనే నాలుగు లక్షలతో ఆశ్రమ నిర్మాణాన్ని చేపడుతున్నామని దీనిని ప్రతి ఒక్క భక్తుడు ఉపయోగించుకొని ధర్మబద్ధంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆడే వసంతరావు,కుమారి ప్యాక్స్ చైర్మన్ మందుల రమేష్,సీనియర్ నాయకులు రాజారెడ్డి , సద్దాం,నారాయణ,గ్రామస్తులుశబరిమాతభక్తులుపాల్గొన్నారు.

# అకాల వర్షం... తడిసిన వేలాది క్వింటాళ్ల ధాన్యం

### ధాన్యం మొలకెత్తడంతో ఆందోళనలో రైతులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా వేలాది క్వింటాళ్ల వరిధాన్యం తడిసి ముద్ద కావడంతో రైతులు తీవ్ర మనో వేదనకు గురయ్యారు. దాదాపు మూడు నుంచి నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసిన ఈ భారీ వర్షం కారణంగా కోసి రోడ్లపై, కల్లాలో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం మొత్తం నీటిలో కొట్టుకుపోయి నిరుపయోగంగా మారింది. అర్ధరాత్రి సమయంలో భారీ వర్షం కురవడంతో రైతులు తమ పంటను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసి, అక్కడక్కడా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొంతమంది రైతులకు చెందిన ధాన్యానికి మొలకలు వచ్చాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంట అకాల వర్షాల వల్ల తడిసి, నల్లగా మారడమే కాకుండా మొలకలు రావడంతో దీనిని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అర్ధరాత్రి కావడంతో, ఇంత భారీ వర్షాన్ని అడ్డుకునేందుకు వారికి ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. పడి గాపులు కాసిన రైతులు చేసేదేమి లేక నిస్సహాయంగా ఉండిపోయారు. భారీగా నష్టపోయిన రైతులు తక్షణమే ప్రభుత్వం స్పందించి, ధాన్యం కొనుగోలుకు ఉన్న గ్రేడింగ్ నిబంధనలను సడలించాలని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, తమకు తక్షణమే తగిన పరిహారం అందించాలని, కష్టపడి పండించిన పంట ఇలా నీటిపాలు కావడంపై రైతులు తమ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ గోడు విని వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## కిసాన్ యాప్ ద్వారా రైతులకు అవగాహన

ప్రజాపక్షం/బైంసా:బైంసా పట్టణంలోని గణేష్ నగర్‌లో,మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిసాన్ యాప్ ద్వారా పత్తి కొను గోలు,సోయాబీన్ పంటల వివరాలు, మార్కెట్ ధరలు,ఫోన్ ద్వారా సమాచారాన్ని పొందడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రాము మాట్లాడుతూ..రైతులు కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.ఇది పంటల కొనుగోలు,మార్కెట్ ధరల అవగాహన,ప్రభుత్వ పథకాల సమాచారానికి చాలా ఉపయోగకరమైన వేదిక అని సూచించారు.ఈ కార్యక్రమంలో బైంసా పట్టణ ఎఇఒ సాయి నాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రాము,మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తుమ్మల దత్తాత్రి,రైతులు రావుల శివ,సాయినాథ్,వెలుముల రాజేశ్వర్,గల్లి వాసులు పాల్గొన్నారు.

## చేపూర్‌లో 3 నుంచి 5 వరకు భీమన్న ఉత్సవాలు

ప్రజాపక్షం/ఆర్మూర్:మండలంలోని చేపూర్ గ్రామంలో ఆదివాసి నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 3 నుంచి 5 వరకు జరగబోయే భీమన్న ఉత్సవాల కరపత్రాలను ఆర్మూర్ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి, మీసుగు నాగరాజులు మాట్లాడుతూ నవంబర్ 3 నుండి 5 వరకు జరగబోయే భీమన్న ఉత్సవాలతో పాటుమాజీ పిఎసిఎస్ వైస్‌చైర్మన్ క్రీస్తు శేషులు మీసుగు పెద్దరాజన్న జ్ఞాపకార్థం జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు వారి కుమారుడు ఎస్టీసెల మండల అధ్యక్షుడు నాగరాజు ఈ సందర్భంగా తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లావ్యాప్తంగా ఆదివాసి నాయకపోడ్ సంఘంసభ్యులు కబడ్డీపోటీలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు సారంగి శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, కుస్తాపురం గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ , న్యాయవాది బట్టునవీన్ పాల్గొన్నారు.

## గ్రామంలో గుడుంబా, నాటుసారా బంద్



ప్రజాపక్షం/పెంచికలపేట్ :పెంచికల పేట్ మండలంలోని అగర్ గూడ గ్రామంలో గుడుంబా, నాటుసారా అమ్మకాలు బంద్ చేయడానికి గ్రామ యువత ముందుకొచ్చారు. గ్రామంలో మద్యం, మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం జరగకుండా సహకరిస్తామని ముందుకు వచ్చి, గ్రామ పెద్దలు గ్రామస్తులు, యువత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గురువారం నుండి గ్రామంలో గుడుంబా నాటుసారా అమ్మరాదని, అమ్మిన విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధిలో అందరూ పాలుపడాలని, దేశానికి ఆదర్శంగా అగర్ గూడ గ్రామాన్ని నిలపాలని అన్నారు. గ్రామంలో గుడుంబా నాటుసారా పూర్తిగా నిషేధించేందుకు గ్రామ యువత పూనుకోవడాన్ని అందరూ స్వాగతించారు.

## కార్మికుల సమస్యలపై ఎఐటియుసి నాయకుల గేటు మీటింగ్




ప్రజాపక్షం/రామగిరి :గురువారం సత్తుపల్లి ఓపెన కాస్ట్ లో ఎఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి ఈ గేట్ మిట్టింగ్ లో సింగరేణి కార్మికులను ఉద్దేశించి కార్మికుల సమస్యలపై జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ ,డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి. రావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నటువంటి ఈపీ ఆపరేటర్ల ను డి టు సి టు బి గ్రేడ్లను ఇప్పించాము అదేవిధంగా యాజమాన్యంతో మాట్లాడి ఎన్ మైనస్ టు, పెరిక్స్ పై టాక్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేసాము పరిష్కరిస్తామని యజమాన్యం హామీ ఇచ్చారు.యధావిధంగా ప్రతినెల మెడికల్ బోర్డు నిర్వహించాలని, మెడికల్ ఇన్వాల్యుడేషన్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలని సంస్థ సి అండ్ ఎండి ఎన్. బలరాం దృష్టికి తీసుకు వెళ్ళాము అని కార్మికులకు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా

### ఎస్ఐ స్వరూప్ రాజ్



ప్రజాపక్షం /హాజీపూర్:మద్యం సేవించి వాహనాలు నడపడం వలన అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి అని హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ అన్నారు. గురువారం హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో మద్యం సేవించి పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి లక్షెట్టిపేట్ లోని జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వరూప్ రాజ్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు గురవుతారని, తద్వారా వాహనాలు నడిపే వ్యక్తులతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న ఇతరులకు కూడా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ వ్యక్తులకు న్యాయస్థానాలు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా రవాణా శాఖ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో పోయేది ప్రాణం మాత్రమే కాదని, ఆ కుటుంబం రోడ్డుపాలు అవుతుంది అని, గమ్యం చేరేంత వరకు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులు ఉన్నారు.

## వారంరోజుల్లో జిల్లాకు సఫారీ వాహనాలు

### ఎకో టూరిజంలో కదలిక

ప్రజాపక్షం /నందిపేట్ :నిజామాబాద్ జిల్లాలో ఎకో టూరిజం ఏర్పాట్లలో కదలిక వచ్చింది శ్రీరాంసాగర్ బ్యాంక్ వాటర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి జిల్లాకు మూడు సఫారీలను కేటాయించింది. ఇందుకోసం 45 లక్షలు మంజూరు చేసింది. ఒక్కొక్క వాహనాన్ని 15 లక్షలు వెచ్చించి పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా తయారుచేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా తెలిపారు. డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి శివారులో అటవీశాఖ అధికారులు ఆర్కిటెక్చర్‌ను రప్పించి కాటేజీలు, రిసార్టులు, వాచ్ టవర్ ఎలా నిర్మించాలో డిజైన్ తయారుచేయించి పనులు చేపడతారు. ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ. 1.4 కోట్లు కేటాయించింది.

గాదేపల్లి, నందిపేట్ మండలంలోని ఉమ్మెడ, జలాల్‌పూర్‌ను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించారు. జింకలు, విదేశీ పక్షుల సందడి ఎక్కువగా ఉండే ప్రాంతం గాదేపల్లిని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం గ్రామస్తులు వేరేచోట రెండు ఎకరాల స్థలం కేటాయించారు. డిజైన్ పూర్తి కాగానే పనులు ప్రారంభించనున్నారు.

## శ్రమ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తుంది

### జిఎం విజయ భాస్కర్ రెడ్డి



ప్రజాపక్షం/రెబ్బెన :సమాజ శ్రేయస్సు కోసం చేసే శ్రమలో ఆనందం, ఆరోగ్యం ఉంటుందని జిఎం ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం గోలేటిలోని మురుగు నీటి శుద్ధి కేంద్రం, శ్రీరామచంద్ర మిషన్ ధ్యాన కేంద్రం, డంప్ యార్డ్ పరిసరాల్లో స్వచ్ఛత కోసం ఆయన శ్రమ దానం చేశారు. రెండు గంటల పాటు జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి ముళ్ళపొదలు, చెత్త, గడ్డి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. శ్రమతో శారీరక వ్యాయామంతో పాటు పరిసరాలు శుభ్రపడతాయని ఆయన పేర్కొన్నారు. సొంత లాభం కోసం చేస్తే స్వార్థం అనిపించుకుంటుందని, తోటి వారి శ్రేయస్సు కోసం చేసే కర్మ ఇరువురికి సమాజానికి ప్రయోజనాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, డిజిఎం (సివిల్) ఎస్‌కె మదీనా బాషా, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవి కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, సివిల్ ఇఇ రాజేంద్రప్రసాద్, మేనేజర్ ముజీబ్, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ పాల్గొన్నారు.

## సర్దార్ పటేల్ స్ఫూర్తితో 2కే రన్

### ఎస్ఐ స్వరూప్ రాజ్

ప్రజాపక్షం/హాజీపూర్ :ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించబడే రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా హాజీపూర్ పోలీసులు ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఈ పరుగులో మండల ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు హాజీపూర్ పోలీస్ స్టేషన్ వద్ద 2కే రన్ ప్రారంభమై రాంపూర్, పడ్తన్ పల్లి గ్రామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం గ్రౌండ్ వరకు కొనసాగనుందని వెల్లడించారు. జాతీయ సమైక్యతా కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, యువత, మీడియా మిత్రులు, అన్ని శాఖల అధికారులు, క్రీడారంగ ప్రముఖులు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## బదిలీపై వెళ్తున్న విజయ ప్రసాద్‌కు ఘన సన్మానం




ప్రజాపక్షం/మందమర్రి :బదిలీపై కార్పొరేట్ హెచ్‌ఆర్‌డి విభాగానికి వెళ్తున్న ఎస్ఓటు జిఎం ఆర్. విజయ ప్రసాద్‌కు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ప్రతి అధికారి తన సేవలను ఒక ప్రాంతంలో పూర్తి చేసిన తర్వాత కొత్త బాధ్యతల కోసం వేరే స్థలానికి బదిలీ అవడం సర్వసాధారణమని, కానీ సేవలలో చూపిన నిబద్ధత కర్తవ్యనిష్ఠ మాత్రం చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలో ఎస్ఓటు జిఎంగా ఆర్. విజయ ప్రసాద్ అందించిన సేవలను ఆయన ప్రశంసించారు. అనంతరం ఏరియా అధికారులు జ్ఞాపికను అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, మందమర్రి ఏరియా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్‌సి జాయింట్ కన్వీనర్‌గా కత్తెరపాక రాజేష్



ప్రజాపక్షం/జన్నారం:టిపిసిసి ఎస్‌సి జాయింట్ కన్వీనర్‌గా జన్నారం మండలం కామన్ పల్లి గ్రామానికి చెందిన కత్తెరపాక రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఎస్‌సి డిపార్ట్‌మెంటు చైర్మన్ నగరిగిరి ప్రీతమ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో అత్యున్నతమైన బాధ్యత గల పదవిని అప్పచెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, అందరికీ అందుబాటులో ఉంటూ, తన సహాయ సహకారాలు అందిస్తూ, అభివృద్ధికి తోడ్పడుతానని పేర్కొన్నారు. రాజేష్ నియామకం పట్ల కామన్ పల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# తడిసిన, రంగు మారిన వడ్లను కోతలు లేకుండా కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కొనుగోలు ఆలస్యమై, వర్షాల వలన తడిసిన మరియు మొలకలు వచ్చి, రంగు మారిన ధాన్యాన్ని ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రోజున సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో వర్షాల వలన తడిసిన ధాన్యాన్ని పరిశీలన చేశారు. రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి గత పది రోజులైనా కానీ కొనుగోలు సరిగా జరగకపోవడం వలన,అకాల వర్షాల కారణంగా, వారికి సరిగా సదుపాయాలు చేయకపోవడం వలన ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చి, రైతులు చాలా అవస్థలు పడతా ఉన్నారన్నారు. రైతుల పరిస్థితి చూసినట్లయితే హృదయ విదారకంగా ఉందనీ,పండించిన పంట కొనుగోలు కొరకు తీసుకొచ్చి, గత 10 రోజుల నుంచి కొనుగోలులు జరగక, కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో ఈ అకాల వర్షాలు రావడం వలన పూర్తిగా ధాన్యం తడిసిపోయి, ధాన్యం నిండా మునిగిపోయి, చాలా ధాన్యం మొలకలు వచ్చేటువంటి స్థితిలో ఇయ్యాల ఉందన్నారు. కొంత ధాన్యం మొలకలు కూడా వచ్చిందన్నారు. ఇటువంటి ధాన్యాన్ని వెంటనే ఈ ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ, రంగు మారిపోయినా కానీ,తడిసినటు వంటి ధాన్యాన్ని ఎటువంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు గత యాసంగిలో గాని, ఇప్పుడు వానకాలంలోనీ సన్న వడ్ల పంటకు 500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మితిమీరిన, ఈ అకాల వర్షాలతోని రైతులు సేద్యం చేస్తున్న పత్తి కావచ్చు, వరి చేన్లు కావచ్చు, కూరగాయల పంటలు కావచ్చు, ఏ పంట అయినా పూర్తిగా రంగు మారి పోయినా, చెడిపోయినా ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా పత్తి చేన్లు అయితే ఆకు జాడిచ్చి, ఎర్రబడిపోయి ఎకరాకు రెండు క్వింటాలు కూడా రాని పరిస్థితిలో ఉన్నాయని, పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితిలో చాలా మంది రైతులు తీవ్ర దుఃఖంతో కనబడుతున్నారని, ఇవన్నీ పరిగణలోకి తీసుకుని కనీసం చేతికి వచ్చిన పంటనైనా వెంటవెంటనే కొనుగోలు చేయాలని, కొంత తేమ శాతం ఎక్కువ ఉన్నప్పటికీ కూడా పత్తి కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. తప్పకుండా ఈ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి తను కూడా రైతు బిడ్డ, రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి గనుక ఈ రైతులను వెంటనే ఆదుకొని, బకాయి



ఉన్న బోనస్ వెంటనే చెల్లిస్తూ, తడిసిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, పత్తి పంట విషయంలో తేమ అంటూ రైతులను ఇబ్బంది పెట్టవద్దని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లు జూపల్లి సందీప్ రావు, మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాల రామారావు,బోయిని రాజమల్లు, సూర శ్యామ్, తిప్పరపు దయాకర్, క్యాదసి. చంద్రమౌళి, తాళ్లపెల్లి. మనోజ్ గౌడ్, గొడుగుల సతీష్, శీలం శంకర్,కొయ్యడ. అరుణ్, శ్రవణ్, రాజు, సంపత్, పసెడ్ల సంపత్,కర్రే కుమార్, గరిగంటి. కుమార్, సర్వర్,గొట్టం మహేష్,కాంపెల్లి రాజు,సరేష్,అసంపెల్లి శంకర్ నాయకులు పాల్గొన్నారు.

## విచారణ పేరుతో వేధింపులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** పెద్దపల్లి జిల్లా లోని ధర్మారం పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు గంధం వంశీకృష్ణ,గంధం అంజయ్య పెద్దపల్లి డీసీపీ కి ఫిర్యాదు చేసినట్లు గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు.పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలం,మల్లాపూర్ గ్రామానికి చెందిన గంధం నారాయణ విద్యుత్ ప్రమాదంలో అనుమానాస్పదంగా మృతి చెందాడని,ఈ ఘటనపై విచారణ నిమిత్తం ధర్మారం సబ్ ఇన్స్పెక్టర్,పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ లు గంధం వంశీకృష్ణ,గంధం అంజయ్యలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో నేరం ఒప్పుకోవాలని తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి,ఎస్సై మరియు కానిస్టేబుల్ బలవంతంగా తమతో తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు.చేయని నేరాన్ని ఒప్పుకోవాలంటూ బలవంతం చేసి మాతో సంతకాలు చేయించుకున్న పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీసీపీ కి అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు.*పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి*కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ప్రజా ప్రభుత్వంలో దళితులపై పోలీస్ స్టేషన్లలో థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ అన్నారు.దళితులంటే పోలీసు అధికారులకు చిన్నచూపుగా మారిందని,పోలీస్ స్టేషన్లలో మానవ హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ధర్మారం పోలీస్ స్టేషన్‌లో గంధం వంశీకృష్ణపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాధితుడు గంధం అంజయ్య, కెవిపిఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కళ్లేపల్లి అశోక్,కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మోదంపల్లి శ్రవణ్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్,సిపేల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి వైద్యానికి రూ.1.61 లక్షలు విరాళాలు

**ప్రజాపక్షం/ధర్మపురి:** గత కొంతకాలంగా బోన్ మ్యారో వ్యాధితో ఇబ్బందులు పడుతున్న నిరుపేద బాలుడు రుద్రాంన్ష్ కు వైద్య ఖర్చుల కోసం ఫేస్ బుక్ మిత్రులు రూ.1.61 లక్షలు విరాళాలు అందించారు.వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామానికి చెందిన అల్లాడి ప్రభాకర్, అనురాధ దంపతుల కుమారుడు రుద్రాంన్ష్ (3) అనే బాలుడు కొన్ని నెలల క్రితం నుండి బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉండగా తల్లి దండ్రులు నిరుపేదలు అవడంతో వైద్య ఖర్చులకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బాలుడి విషయాన్ని తెలుసుకున్న ధర్మపురి కి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి ఈ నెల 4 న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసి సాయం అందించాలని కోరాడు. ఫేస్బుక్ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు,ఇతర దాతలు అనురాధ బ్యాంకు ఖాతాకు రూ.1.61 లక్షలు పంపించారు. వాటిలో కొంత మొత్తాన్ని గురువారం జగిత్యాల సిఐ కరుణాకర్,ఎస్సై రవికిరణ్ తో పంపిణీ చేయించాడు. కృతజ్ఞతలు తెలిపారు. మిగతాది ఆమె బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచారు. ప్రభుత్వం సైతం స్పందించి బాలుడు వైద్యానికి సహాయం అందించాలని రమేష్ కోరారు.

## 'సుప్రీం' చీఫ్ జస్టిస్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి

**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయిపై దాడిని ఖండిస్తూ నవంబర్ 1న తలపెట్టిన చలో హైదరాబాదును ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హైకోర్టు మాజీ జిపి, బార్ కౌన్సిల్ మెంబర్, మాదిగ లాయర్ ఫెడరేషన్ జాతీయ బృందం న్యాయవాదులు గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ కు విచ్చేసి చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని కోరడం జరిగిందని, వారి విజ్ఞప్తి మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ జిపి బైర




పాక జయకర్, మాదిగ లాయర్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు వి వి రత్నం, వేములవాడ న్యాయవాదులు పొత్తూరు అనిల్ కుమార్, గుండ రవి, నక్క దివాకర్, బొడ్డు గంగరాజు, బీమా మహేష్ బాబు, గుడిసె సుదర్శన్, పొత్తూరు మల్లేశం తదితరులున్నారు.

## పాము కనిపిస్తే ఆందోళన చెందకండి..!

**ప్రజాపక్షం/ముత్తారం :** అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాలకు కొండ చిలువ లాంటి భారీ పాములు కనబడితే భయాందోళన చెందకుండా తమకు సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నర్సయ్య తెలిపారు.గత రెండు మూడు రోజులుగా అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేసనపల్లి గ్రామంలో ఇటీవలే భారీ కొండచిలువ కోతిని మింగిన కొండచిలువ చివరికి కోతుల చేతిలోనే హతమైన సంగతి తెలిసిందే.అయితే గురువారం కేశనపల్లి గ్రామానికి చెందిన చొప్పరి రవి ఇంటి వద్ద కొండచిలువ ఉందని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నర్సయ్య కి సమాచారం ఇవ్వగా వెంటనే స్నేక్ క్యాచర్ గడ్డం శ్రీకాంత్ ని పిలిపించి పామును పట్టారు కానీ ఆ పాము కొండచిలువ



కాదని రాటు స్నేక్ అని ఫారెస్ట్ అధికారులు ధృవీకరించారు. పట్టు పట్టుబడిన పాముని అటవీ ప్రాంతంలో బదిలీ వేయడం జరిగిందని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నర్సయ్య తెలిపారు. వారి వెంట బీట్ ఆఫీసర్ పవన్ తో పాటు గ్రామ మాజీ సర్పంచ్ నూనె కుమార్ తో పాటు తదితరులున్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అకాల వర్షాలతో నష్టపోతున్న మొక్కజొన్న వరి పంట రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతూ భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సన్నా రాకపు వరి ధాన్యానికి ఇస్తామన్న బోనాస్ డబ్బులను రైతులకు చెల్లించలేదని, భారీగా వర్షాలు కురుస్తున్నందున మొక్కజొన్న ధాన్యాన్ని వెనివెంటనే తూకం వేసి పంపించేయాలని, అదేవిధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి కటింగ్ లేకుండా ముందస్తుగానే తగిన చర్యలు తీసుకొని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తూకంలో అవకతవకులు జరగకుండా, నిర్వాకులు కటింగ్లకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ తాసిల్దార్ రమేష్ గౌడ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు కాసారం భూమారెడ్డి మండల అధ్యక్షుడు కళ్ళెం మహిపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పోచంపల్లి రమేష్, మోరపు గంగారాజం, జలపతి, రాజేందర్, నరేష్,ఆనందం, వెంకన్న,బుమారెడ్డి తదితరులు ఉన్నారు.

## యుఐ డివిజన్ కో ఆర్డినేటర్‌గా సాయి

**ప్రజాపక్షం/ముత్తారం:** ఎన్.ఎస్.యూఐ మంథని డివిజన్ కో ఆర్డినేటర్ గా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన గంజి సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్ లో ఎన్.ఎస్.యూఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామి కో ఆర్డినేటర్ ఎంపిక చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో మంథని డివిజన్ కో ఆర్డినేటర్ గా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి 2.కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామం నుండి హరిపురం వరకు 2 కే రన్ నిర్వహించడం జరుగుతుందని ముత్తారం ఎస్సై రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముత్తారం మండలంలోని యువకులు తోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

## నారాయణ పాఠశాలలో టిఎల్ఎం మెగా మేళా

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో టిఎల్ఎం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్ట్ వర్కులు టీచర్స్, పేరెంట్స్ కు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ పాఠశాలల ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తిని వెలికి తీసేందుకు టిఎల్ఎం ఎంతగానో ఉపయోగపడుతుందని, అంతేకాకుండా విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చైతన్య రావు తో పాటుగా, కోఆర్డినేటర్ శ్వేత, ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, ఏవో శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ‘పారమిత’ విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర పర్యటన

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** నగరంలోని పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు , ఇతర సిబ్బంది పర్యవేక్షణలో భువనగిరి సమీపంలోని వన్ డే కిసాన్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఈ పర్యటనలో విద్యార్థులు పంటల సాగు విధానాలు, సేంద్రీయ ఎరువుల తయారీ, పశు సంరక్షణ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు వంటి అంశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, మోట ఎలా కొట్టేవారు, యంత్ర సహాయంతో వ్యవసాయం చేస్తున్న విధానాలు వారికి ఆసక్తికరంగా వీక్షించారు. విద్యార్థులు పూర్వకాలంలో రైతులు వ్యవసాయం చేసిన పద్ధతులు,వారు ఉపయో



గించిన పరికరాలను ఆసక్తిగా చూశారు. కుందెన, రుబ్బురోలు, కుమ్మరి చక్రంతో కుండల తయారీ విధానాలను నేర్చుకున్నారు. దీంతో వ్యవసాయం పట్ల గౌరవ భావం, స్వావలంబన, ప్రకృతి ప్రేమ పెరిగినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వియుయం ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయస్థానం కోసం బిల్డింగ్ పరిశీలన



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో న్యాయస్థానం ఏర్పాటు కోసం బిల్డింగ్‌ను హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సంధర్భంగా శంకరపట్నం న్యాయవాదలు శంకరపట్నంలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలని హైకోర్టులో వినతి పత్రం సమర్పించారు. వారి వినతిపత్రం పరిశీలించి జిల్లా న్యాయస్థానం కరీంనగర్ వారిని ఏర్పాట్లు చూడాల్సిందిగా ఆదేశించారు. జిల్లా కోర్టు సూచనల మేరకు హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ కేశవపట్నంలోని బిల్డింగులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడివో కృష్ణ ప్రసాద్, ఎంఆర్‌వో సురేఖ, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నేడు 2కే రన్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా మండల కేంద్రంలో గొల్లపల్లి పోలీసు విభాగం ఆధ్వర్యంలో 2 కె రన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల 30 నిమిషాలకు నిర్వహించనున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం గొల్లపల్లి పోలీస్ స్టేషన్ నుండి గోవిందుపల్లి ఎక్స్ రోడ్ వరకు 2కె రన్ కార్యక్రమం నిర్వహించబడుతుంది. దేశ ఐక్యత, సమగ్రత, సోదరభావాన్ని ప్రతిబింబించే 2 కె రన్ కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు యువత, విద్యార్థులు, మీడియా మిత్రులు ,అన్ని శాఖల అధికారులు , క్రీడారంగ ప్రముఖులు ,అన్ని సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి మహానేత స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఈ 2కె రన్ లో భాగస్వామ్యం అవ్వాలని పేర్కొన్నారు.

## వివాహ వేడుకల్లో నిశాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు కొత్త విజయ రామన్న దంపతుల కూతురు చేతనరక్షితసురేష్ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి,ఎల్లాల లింగారెడ్డి, బొల్లం శంకరయ్య ,మాజీ సర్పంచ్ పురంశెట్టి వెంకటేశం, రాజమల్లు, కరుణాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ‘వాక్ ఫర్ యూనిటీ’ ర్యాలీ

**ప్రజాపక్షం/గంగాధర:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సంధర్భంగా జాతి ఐక్యత దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్సై వంశీ కృష్ణ ఆద్వర్యంలో మండలంలోని మధురానగర్‌లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విధ్యార్థినిలు, కళాశాల సిబ్బంది, స్థానిక రాజకీయ నాయకులు, పోలీసు సిబ్బందితో కలిసి గంగాధర మండల కేంద్రంలో 2కెఎం వాక్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ ఉద్దేశ్యాలను, ఆశయాలను పాఠశాల విధ్యార్థులకు వివరించారు. విధ్యార్థినులు తమకు ఏ సమస్య ఉన్నా వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు, తల్లి



దండ్రులతో, నేరుగా పోలీసులకు చెప్పాలని సూచించారు. పరిష్కరిస్తామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

## మతసామరస్యానికి ప్రతీకగా అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/జమ్మికుంట:** మతసామరస్యానికి ప్రతీకగా జమ్మికుంటలో ఓ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని బొమ్మలగుడి శివాలయంలో ముస్లిం కుటుంబానికి చెందిన మహమ్మద్ భాను ఉస్మాన్‌ల కూతురు అస్మా 23వ జన్మదినం సంధర్బంగా అన్నపూర్ణ సేవా సమితి ఆద్వర్యంలో 200 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సంధర్బంగా భాను మాట్లాడుతూ తమ కూతురు



అస్మా జన్మదినం సంధర్బంగా ప్రతి సంవత్సరం 10 మందికి అన్నదానం చేసేదని, అస్మా ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం లండన్‌లో చదువుతోందని, ఆమె కోరిక మేరకు పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. దేవుడు అందరికీ వివిధ రూపాల్లో దర్శనమిస్తారని, హిందూ ముస్లింలు అనే బేధం మనం ధరించే వేషానికే తప్ప మనసుకు కాదన్నారు. అందరూ ఒక్కటేనని, అందరి దేవుడు ఒక్కడేనని పేర్కొన్నారు. కులమతాలకతీతంగా పేద ప్రజలకు భోజనం ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటిన ముస్లిం కుటుంబానికి భక్తులు ఆశీర్వదించారు. ఈ సంధర్బంగా వారిని శాలువాతో సత్కరించి అభినదించారు. అన్నపూర్ణ సేవా సమితి ఆద్వర్యంలో గురువారం చిదురాల నిశాంత్ పుట్టినరోజు సంధర్బంగా కృష్ణమూర్తి రాధిక, కొమురవెల్లి వేదాన్ష్ పుట్టినరోజు సంధర్బంగా స్వాతి మురళీకృష్ణ, మహమ్మద్ అస్మా పుట్టిన రోజు సంధర్బంగా భాను ఉస్మాన్ అన్న ప్రసాద వితరణ చేసినట్లు అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు తెలిపారు.

## అన్నదాతలు ఆందోళనకు చెందొద్దు.. ఆదుకుంటాం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర:** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. గంగాధర వ్యవసాయ సహకార సంఘం ఆద్వర్యంలో గంగాధర, మంగపేట, ఇస్లాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రైతుల కోసం నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలకు రైతుల వివరాలను నమోదు చేసుకుని తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురికావద్దని, సమస్యలను



తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడివో దమ్మని రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, పడాల రాజన్న, సాగి అజయ్‌రావు, దొర్నాల శ్రీనివాస్ రెడ్డి, రోమాల రమేష్, పడితపల్లి కిషన్, గుజ్జుల బాపు రెడ్డి, గడ్డం అంజయ్య, కరుణాకర్, చందు, మధు, రాచమల్ల భాస్కర్, మంత్రి మహేందర్, శ్రీనివాస్, గంగాధర ప్రవీణ్ తదితరులున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాపక్షం/రామగిరి :** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఎన్నారైలు అడ్దూరి శేషి కుమార్, గంజి సాయి కుమార్ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి, కోఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్ ను సంప్రదించి సహాయం చేయడానికి వారి సహకారంతో రాంనగర్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి ఇటీవల ఇంటి పెద్ద రాజమౌళి అతని కుమారుడు నవీన్ మరణించడంతో ముగ్గురు ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్న ఆ మహిళా కుటుంబానికి నిత్యావసర సరుకులు పిల్లలకు బట్టలు వారికి అందించారుఅనంతరం, క్లబ్ డైరెక్టర్, గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సమాజ సేవలో ముందుంటుంది. అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం మా క్లబ్ యొక్క ప్రధాన బాధ్యత. ఎన్నారైలు అడ్దూరి శేషి కుమార్ , గంజి సాయి కుమార్ స్పందించి సహకరించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.వారి వంటి సేవా భావం కలిగిన వ్యక్తుల ప్రోత్సాహం మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య యాదవ్,డైరెక్టర్ దొడ్ల శ్రీనివాస్, కొంక రాజు, దొంతుల సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి శివారు భూములకు పరిహారం

**ప్రజాపక్షం/రామగిరి** రామగిరి మండలంలోని రత్నపూర్ గ్రామంలోని మేడిపల్లి శివారు లో రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు గాను 210 ఎకరాల 27 గుంటల భూ సేకరణ చేసింది ఎకరం భూమి గాను 25 లక్షల రూపాయలు నష్టపరిహారం రైతులకు ఇచ్చుటగాను చట్ట ప్రకారం పరిహారం పొందే హక్కు రాష్ట్ర ప్రభుత్వం చట్టం.2016 కేంద్ర ప్రభుత్వం 21/2017 ద్వారా సవరించచబడిన కేంద్ర భూ సేకరణ చట్టం 2013 చట్టము నెం.30/2013 జీవో నెంబర్ 120 ద్వారా రెవెన్యూ డిపార్ట్మెంట్ చట్టబద్ధంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ అధ్యక్షన జిల్లా సంప్రదింపుల సిఫార్సులమేరకు ఎకరం భూమి పరిహారం 25 లక్షలు ఏకమొత్తం ప్యాకేజీ ఒకేసారి ఇచ్చుటకు గాను భూ సేకరణ అధికారి కాశబోయిన. సురేష్ జీవోలను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

## తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను యుద్ద ప్రాతిపదికన ఆదుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని వెంటనేతూకం వేయాలని బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్‌డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. పైనుంచి వస్తున్న వాగు ఉధృతి పెరగడంతో మార్కెట్ యార్డులోకి వర్షం నీళ్లు రావడంతో రైతుల ధాన్యం మొత్తం వరదలో కొట్టుకుపోవడంతో రైతులు బోరున విలపించగా వారిని ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

## అన్నదమ్ముల గొడవలో తమ్ముడు మృతి

**ప్రజాపక్షం/వీణవంక:**అన్నదమ్ములమధ్యజరిగినగొడవలో తమ్ముడు మృతి చెందిన సంఘటన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుకాసి నరేష్(35) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఈ నెల 28న వీణవంక మండల కేంద్రంలో నివాసం ఉంటున్న అతని అన్న సుకాసి సురేష్‌కు ఫోన్ చేసి విపరీతంగా తిట్టాడని, సురేష్ రెడ్డిపల్లి గ్రామానికి వచ్చి ఎందుకు తిడుతున్నావని నెట్టి వేయగా నరేష్ బండపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజిఎంకు తరలించారు. గురువారంమరణించాడు.నరేష్‌కు వివాహమై ఇద్దరుకుమార్తెలున్నారు.నరేష్ తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మి నారాయణ తెలిపారు.

# రైతులను నిండా ముంచిన వర్షాలు.. చేతికొచ్చిన ధాన్యం నీటిపాలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో తుఫాను ప్రభావంతో రైతులను నిండా ముంచిందని ఆరుగాలం శ్రమించి పండించి చేతికొచ్చిన సమయంలో వరద ఉధృతికి వరి పొలాలు నేల మట్టం అయినాయని, కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యం తడిసి ముద్దయి నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలలో మోకాలు వరకు వర్షపు నీరు రావడంతో వరి ధాన్యం పూర్తిగా మునిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం అధికారులు స్పందించి తక్షణమే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, వర్షానికి పూర్తిగా నేల మట్టమైన వరి పొలాలను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

## రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించం

**ప్రజాపక్షం/జమ్మికుంటః** వడ్ల కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న హెచ్చరించారు. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో పాత వ్యవసాయ మార్కెట్‌లోని వడ్ల కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు బార్దాన్ సంచుల పంపిణీ, వడ్ల మ్యాచర్ పరిశీలనలో అధికారులు ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. ట్రాక్‌షీట్ ఇస్తేనే వడ్లు మిల్లుకు పంపాలని రైతులకు సూచించారు.



## రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/జమ్మికుంటః** రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు కోరారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో ఇలాంటి వర్షాలు పడడం బాధాకరమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం కేంద్రాలను ఓపెన్ చేసి చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. గతంలోనూ వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యం తెచ్చిన రైతులకు సరిపడా టార్పాలిన్లు ఇవ్వాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి పంట నష్టంపై సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.



## నేలకొరిగిన వరి పంట

**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో మొంథా తుఫాను రైతులకు కన్నీరు మిగిల్చింది. పంట చేతికొచ్చే సమయంలో ధాన్యం పొలాల్లో నేలకొరిగింది. అధికారుల ప్రాథమిక అంచనా మేరకు కరీంనగర్ రూరల్ మండలంలో 1832 మంది రైతులకు చెందిన 2498 ఎకరాల వరి, 669 మంది రైతులకు చెందిన 1033 ఎకరాల పత్తి పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి సత్యం తెలిపారు. కొత్తపల్లి మండలంలో 1453 ఎకరాల వరి, 498 ఎకరాల పత్తి పంట నేలకొరిగిందని ఏఈవోలు అంచనావేశారు. పంట పొలాల్లో నీరు నిలిచిందని, కింద పడ్డ వరి నీట మునిగి మొలకెత్తే అవకాశముందని వారు తెలిపారు.మరో వైపు తడిసిన ధాన్యాన్ని కోసేందుకు రైతులకు అదనపు భారం పడుతుందని కన్నీరు మున్నీరవుతున్నారు. నీట మునిగిన వరి రంగు మారడం వల్ల గిట్టుబాటు ధర రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నీట మునిగిన పంట పొలాలను కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పంపిణీ చేయాలని కోరారు.





## రైతులకు పరామర్శ

**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలలో నిన్నటి రోజున కురిసినటువంటి భారీ వర్షాలతో వరి కొనుగోలు సందర్శించి కల్లాలలో తడిచిన వడ్ల రైతులను పరామర్శించిన భారతీయ జనతా పార్టీ రూరల్ మండలాధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ వడ్లను కూడా కొనలేదన్నారు. తక్షణమే ఈ కొనుగోలు కేంద్రాలల్లో ఉన్న ప్రతి గింజను మ్యాచర్ తో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చేయాలని భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, పల్లి కొండ నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ చింతకుంట గౌతమ్, బూత్ అధ్యక్షులు ఆడెపు విజయ్, ఆది జలంధర్, నల్ల వెంకట్ రెడ్డి , కల్లెడ్ల నరేష్, బుర్ర వినోద్, బిజెపి నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగింది.



## నీట మునిగిన పంట పొలాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** మొంధా తుఫాన్ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మానేరు పరివాహ గ్రామాలైన ఓడేడ్,పారుపల్లి,శాత్రాజ్ పల్లి, అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, సందరెల్లి, ముత్తారం గ్రామాలతోపాటు తదితర గ్రామాల్లో ఎడతెరుపు లేకుండా రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి తోడు మానేరు గేట్లు ఎత్తడంతో పంట పొలాలు నీట మునిగి జలమయమయ్యాయి. కొంత మంది రైతుల వరి పంట నేలకొరిగి పత్తి పంట తడిసి ముద్దయింది. వ్యవసాయాన్ని నమ్ముకుని బతుకుతున్న తరుణంలో ఈ అకాల వర్షాలతో పంట నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





## అంగన్వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు..!




**ప్రజాపక్షం/ముత్తారం :** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ముత్తారం మండల కేంద్రంలోని ఒకటవ అంగన్వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది.గురువారం ఉదయం అంగన్వాడి కేంద్రానికి వచ్చిన టీచర్ సత్యవతి అంగన్వాడి కేంద్రంలో ఉన్న నీటిని తోడాల్సి వచ్చింది. కాగా ఈ వరద నీరుతోచిన్నారులకు సంబంధించిన పుస్తకాలు పాక్షికంగా తడిసిపోయాయి.

## పంట నష్టాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారి



**ప్రజాపక్షం/శంకరపట్నంః** శంకరపట్నం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలో నష్టపోయిన పంటలను మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో 2100 ఎకరాలలో పంట నేలవాలి, నీట మునిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. గురువారం క్లస్టర్ల వారీగా ఏఈవోలు 17 గ్రామాల్లో 1503మందిరైతులుపంటనష్టపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే తదుపరి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

## నేల వాలిన వరి పంట



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి అకాల వర్షాలు కురిసి అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. ఒకపక్క చేతికొచ్చిన మొక్కజొన్న పంట మార్కెట్ యార్డుల్లోనే కుప్పలు తెప్పలుగా ఉండడంతో అకాల వర్షాలు కురుస్తున్నందున తడిసి ముద్ద అవుతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇవన్నీ ఒకే అయితే మరోపక్క వరి పంట కోతకు రావడంతో భారీగా వర్షాలు పడుతుండడంతో చేతికొచ్చిన వరి పంట నేల వాలడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయారు.

## ఖమ్మంపల్లి నుండి అడవిశ్రీరాంపూర్‌కు రాకపోకలు బంద్



కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

**ప్రజాపక్షం/ముత్తారం :** ఖమ్మంపల్లి నుండి అడవి శ్రీరాంపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి పై వరదనీరు ఉదృతంగా ప్రవహించడంతో రాకపోకలు బంధు అయ్యాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అబ్రమాబాద్ శివారులోని దొడ్డ బాలాజీ పొలం వద్దనున్న నల్ల వాగు కల్వర్టు వద్ద మానేరు నీరు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో ఖమ్మంపల్లి నుండి ముత్తారం వైపు వచ్చే ద్విచక్ర వాహనాలు ముత్తారం నుండి ఖమ్మం పల్లి వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు వాహనాలను అక్కడే నిలిపి ఆగిపోయారు.కల్వర్టు పై నుండి వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో చేసేదేమీ లేక వాహనదారులు వెనుతిరిగి మంథని నుండి వెళ్లారు.

## జలమయమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



**ప్రజాపక్షం/ తంగళ్ళపల్లి :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంవర్షపు నీటితో జలమయమైంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో రెండు రోజుల నుండి కురిసిన వర్షానికి ఆసుపత్రి వెనుకభాగంలో వరదనీరు నిలిచిపోవడంతో రోగులకు ఇబ్బందిగా మారింది. డ్రైనేజీలోకి లింకు కలపకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే మురికి నీరు నిలిచిపోయింది.ముందస్తు చర్యలు చేపడితే నీరు నిలిచేది కాదని రోగులు పేర్కొంటున్నారు.

# కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అష్టకష్టాలు



**ప్రజా పక్షం/రుద్రంగి :** ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన వరి ధాన్యం అకాల వర్షాలకు తడిచి దెబ్బ తిందని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని రుద్రంగి మండల బిఆరెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం,మాజీ ఎంపిపి గంగం స్వరూప మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. నిన్నటి వరకు యూరియా బస్తాల కోసం బాధలు పడ్డ రైతన్న నేడు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో బాధపడుతున్న రైతన్నను ఆదుకోవాల్సిన మంత్రులు ఎమ్మెల్యేలు జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉండి రాష్ట్రాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దడమే కాకుండా తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ నిలువునా వంచిస్తుందని దీంతో రాష్ట్రంలో అన్నదాత బ్రతుకులు ఆగమ్య గోచరంగా మారాయని వాపోయారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని అలాగే నేలకొరిగిన వరి పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, మంచే రాజేశం, మడిశెట్టి ఆనందం, కంటే రెడ్డి, బోయిని చంద్రయ్య, ఉప్పులూటీ గణేష్, కోడిగంటి శ్యామ్, చెప్యాల గణేష్, ఆకుల గంగధర్, కదాసు లక్ష్మణ్, గెంటే ప్రశాంత్,దయ్యాల పెద్దలు, ఎండి బాబా, గజే నరేష్ పాల్గొన్నారు.

## ఘనంగా గోపాష్టమి..

**ప్రజా పక్షం/ వేములవాడ :** పట్టణంలోని స్థానిక గోశాలలో గోపాష్టమి ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గోమాతలకు పూజ జరిపి గోగ్రాసం పెట్టి అనంతరం ముఖ్య వక్త రాష్ట్ర బజరంగ్దళ్ కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ ద్వాపర యుగంలో బాలకృష్ణుడు 5 సంవత్సరాల వయసులో తండ్రి ఆజ్ఞతో సోదరుడు బలరాములతో కలిసి గోవుల రక్షణ కోసం మొదటిసారిగా గోవుల మందను తోలుకొని అడవికి వెళ్ళిన రోజు, శ్రీకృష్ణ పరమాత్మ గోపాలుడుగా మారిన రోజు కార్తీక శుద్ధ అష్టమిని కావున ఈరోజున ప్రతి సంవత్సరం గోపాష్టమి కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ జరుపుకుంటుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గడప కిషోర్ రావు, నాగుల రాము, గౌరిశెట్టి శ్రీనివాస్, లక్ష్మణ్, సనుగుల భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగి పోలీసుస్టేషన్ తనిఖీ.. నమోదైన కేసులపై ఆరా



**ప్రజాపక్షం / రుద్రంగి :** వార్షిక తనిఖీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషనపరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా నమోదవుతున్న కేసుల గురించి కంపారిటివ్ స్టేట్మెంట్ ను పరిశీలించి, అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను,గ్రేవ్ కేసెస్ లలో ఉన్న సిడి ఫైళ్లను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో అధికారులు సిబ్బంది పోటీపడి విధులు నిర్వహించాలని అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వర్టికల్ వారిగా అధికారులు సిబ్బంది విధులు నిర్వహించాలని ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారి వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమగ్ర సమాచారాన్ని సేకరిస్తూ డయల్100, గల్ఫ్ మోసాలు, సైబర్, సీసీ కెమెరాల ఉపయోగం మొదలగు అంశాల మీద అవగాహన కల్పింస్తు, గ్రామల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీయలన్నారు. మీ చుట్టూ ఉన్న పరిసరాల్లో గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు అమ్ముతున్నటుగా తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ గంగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ఓసి మంజూరు



**ప్రజాపక్షం/వేములవాడటౌన్:** వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీకి చెందిన ఎండి రజాక్ కొడుకు ఎండి జహీర్ ఖాన్ అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా వైద్యులను ఆదేశిస్తూ ప్రభుత్వం నుండి 2,50,000 రూపాయల ఎల్ ఓసి ని మంజూరు చేయించారు. ఎల్ఓసి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు రజాక్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం /రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ.అకాల వర్షాల కారణంగా వరి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయని అలాగే వాతావరణం కూడా రైతులకు అనుకూలంగా లేదు కాబట్టి మ్యాచర్ కండిషన్ లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రైతులకు నష్టం కాకుండా చూడాలని కోరారు. అలాగే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు,కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ రైతులు పండించిన దాన్యన్నీ కపడడటంలో లేదని విమర్శించారు. తుఫాన్ ఉందని వారం నుండి హెచ్చరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం స్పందన కారువాయిందని అన్నారు.కొనుగోలు కేంద్రల్లో కనీస సౌకర్యాలు లేవని వడ్లపై కప్పడానికి టార్పాలిన్ కవర్లు కూడా ఇయ్యలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గండి శ్రీనివాస్, ట్రెజరర్ తాళ్లపల్లి బాలకృష్ణ రావు,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అల్లూరి అల్లూరి రవీందర్ రెడ్డి,అక్కినపల్లి నర్సింగరావు,నేవురి కిషన్,గెంటే మల్లేశం,మర్రిపెల్లి దశరథం పాల్గొన్నారు.

## తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/చొప్పదండిః** అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. పండించిన చివరి గింజ వరకు కొంటామని, రైతులు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పలు పర్యటనలు చేశారు. నేలకొరిగిన పంటలను పరిశీలించి కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడి క్షేత్రస్థాయిలో సర్వే చేసి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలనికోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామ ని భరోసా ఇచ్చారు. రుక్మాపూర్‌లో సిసిఐ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను26 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## 7న అడెల్లి మహాపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధి చెందినన అడెల్లి మాహ పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన నవంబర్ 7న నిర్వహించడం జరుగుతుందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.నవంబర 03వ తేదీ నుండి నవంబర్ 07 వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఇక్కడికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి మహారాష్ట్ర నుండి సైతం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.అనంతరం విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాటును ఆలయ పరిసరాలను,పరిశీలించారుర.

## నేడు కరీంనగర్ జిల్లాలో కల్వకుంట్ల కవిత పర్యటన

**ప్రజాపక్షం/కరీంనగర్ః** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు చేస్తున్న ఆమె పర్యటన వివరాలను జాగృతి నాయకులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తారు. 11.30 గంటలకు శంకరపట్నం మండలంలో కల్వల ప్రాజెక్ట్ సంధర్శించి ఆయకట్టు రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. మద్యాహ్నం 1 గంటలకు హుజురాబాద్ మండలం రాంపూర్‌లో ఇటీవల గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విధ్యార్థిని వర్శిత కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. 3 గంటలకు కరీంనగర్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి మద్యాహ్నం 4 గంటలకు రామడగు మండల కేంద్రంలో శిల్ప కళాకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. 5 గంటలకు చొప్పదండి మార్కెట్ యార్డు పరిశీలించి సాయంత్రం 6 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఇంటి వద్ద మహిళలతో మాటాముచ్చట కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## గుడి స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ పరిధిలోని శ్రీ రాజరాజేశ్వర నగర్ కాలనీ వాసులు గుడి స్థల ఆక్రమణపై గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, సిపి గౌష్ ఆలంకు ఫిర్యాదు చేశారు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం 1989లో తల్గం సత్యనారాయణ, చంద్రమౌళీశ్వర్ అనే వ్యక్తులు సర్వే నెంబర్ 125, 126, 129లలో గల సుమారు 10 ఎకరాల భూమిలో 270 ప్లాట్లు అమ్మగా అందులో గుడికి కొంత స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. ఈ స్థలంలో తాము గుడి నిర్మాణం చేస్తుండగా ఇటీవల ఒక వ్యక్తి ఆ భూమిని తాను కొనుగోలు చేశానని, ఈస్థలం తనదని గుడిలోకి వెళ్లకుండా ఇనుప రాడ్లు అడ్డుగా పెట్టారని ఆరోపించారు. కాలనీ అధ్యక్షులు గాండ్ల లక్ష్మినారాయణ, వైకుంఠం, కమలాకర్ గౌడ్, తిరుపతి, రమేష్, మల్లన్న, నాంపల్లి, రాములు తదితరులున్నారు.

## జిమ్, చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం

**ప్రజాపక్షం/జమ్మికుంటః** హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ పనితీరు బేష్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. రూ.1.50 లక్షలతో జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో జిమ్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయడానికి కరీంనగర్ సిపి నిధుల నుంచి మంజూరు చేయగా పూర్తయ్యింది. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసిపితో కలిసి పట్టణ సిఐ ఎస్.రామకృష్ణ గౌడ్ ఆద్వర్యంలో జిమ్‌ను గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జిమ్ పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్టేషన్‌కు వచ్చే పిల్లలు ఈ పార్కును ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కలియతిరిగి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎం.నాగరాజు, సతీష్, పోలీసులు పాల్గొన్నారు.

## భీమేశ్వరుడి సన్నిధిలో జస్టిస్ నందేశ్ ఎస్ దేశ్‌పాండే

**ప్రజాపక్షం/ వేములవాడ :** శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామి వారిని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందేశ్ ఎస్ దేశ్ పాండే కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం అందజేసి, స్వామివారి శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదంను అందజేశారు.